గారిలాంటి చేతి చలవ ఉన్న మనిషి మొక్కలే వేయాలిగాని, అవి పూయకా, కాయకా మానతాయా? కనుక అవి ఎంత బాగా పెరిగాయో చెప్పటం అనవసరం.

ఆ రోజు వరలక్ష్మీ వ్రతం కావడం వల్ల పూజా, పునస్కారాలవీ ముగించి, తొమ్మిది రకాల పిండి వంటలు కష్టపడి వండి, నారాయణరావుగారిని ఆఫీసుకి పంపి తల్లీ కూతుళ్ళు ఆలస్యంగా భోంచేశారు. నీరజ ఎవరో ఫ్రెండ్ ఇంటికి వెళ్ళింది. ఆవిడ గేటు వేసొచ్చి వెనుక గదిలో కూటికునుకు తీశారు.

రెండిళ్ళ అవతలనున్న పార్థసారథి ఆవులు ఒక్క తోపుతో గేటు తలుపులు తీసుకొని, ఇంట్లోకి జొరబడి, కామేశ్వరమ్మగారు ప్రాణప్రదంగా పెంచుకొచ్చిన, పిందలేసిన కూరగాయల మొక్కలనూ, కొత్తగా మొగ్గ తొడిగిన పూల మొక్కలనూ తినేయసాగాయి. ఆ చప్పుడికి తెలివొచ్చిన కామేశ్వరమ్మగారు లేచి ఆదరాబాదరా బయటికొచ్చారు. ఏం లాభం? అప్పటికే అన్నీ తినేసి, తొక్కి తొక్కి నాశనం చేసి, పచ్చగానున్న పెరడంతా స్మశానంగా మార్చేశాయి అవి. ఆవిడ కొన్ని క్షణా లలా నిశ్చేష్టురాలై ఉండిపోయారు. ఆ తరువాత ఒంటి మీదికి తెలివి తెచ్చుకొని భయపడుతూ భయపడుతూనే అది పోట్లగొడ్డు గనక ఓ కర్ర అందుకొని దాన్ని బయటకు గెంటేరు. తన శ్రమంతా ఈనగాచి నక్కల పాలు చేసినట్లయినందుకు ఆవిడకు కళ్ళనీళ్ళ పర్యంతమైంది. ఇంతలో నీరజ వచ్చింది. పెరటినీ, తల్లినీ మార్చి మార్చి చూసింది. కోపం కట్టలు తెంచుకుంది. గొడ్ల మీద కాదు, గంగి గోవులాంటి తల్లిమీద!

"నీ కెన్నిసార్లు చెప్పినా నీ పిచ్చి వదులుకోవమ్మా! అందుకే నాకు నువ్వంటే చిరాకువేస్తుంది. నిన్నసలు మొక్కలెవరెయ్యమన్నారు? ఎన్ని అనుభవాలు జరిగినా బుద్ధి రాకపోతే ఎలా? అందరిలా నాకు మొక్కల పెంపకం అచ్చిరాదనుకొని సరిపెట్టేసుకోరాదా? చేతులు పుళ్ళు పడేలా చాకిరీ చేసి, పడ్డ శ్రమంతా కళ్ళముందే బుగ్గిలో కలుస్తూంటే నువ్వేడవడం, నిన్ను చూసి మేమేడవడం-ఛ!ఛ! ఇది రొటీనైపోయింది. నీ చాదస్తంతో ఎందుకు మమ్మల్నిలా చంపుతావ్?" కూతురు తన మీద ఒంటికాలిపై లేచేసరికి కామేశ్వరమ్మగారికి కాస్సేపటి దాకా బుర్ర పనిచేయలేదు.

క్షణం ఆగి "నీకు మతి పోయిందేమిటే నీరజా! నేనేం తప్పు చేశానని నా మీ దలా ఎగురుతున్నావ్? చేతనైతే వెళ్ళి ఆ పార్థసారథిగాణ్ణి నాలుగు దులిపేసి రా!" అని కొన్ని క్షణాలు మౌనం వహించేరు. "నిజమే! మొక్కల పెంపకం నాకు అచ్చిరాలేదు. పట్టి మొక్కలే కాదు, పిల్లల పెంపకం కూడా! లేకపోతే, చేతికందిన వాడు మట్టిలో కలిసిపోవడం, ఎదిగి తల్లిని అర్థం చేసుకోవలసిన నువ్వే నా మీదికి దండెత్తడం- ఇవన్నీ జరిగేవా?" అంటూ భోరుమన్నారు.

"అది కాదమ్మా! నువ్విలా ప్రతిసారీ బాధపడుతుంటే మాకెంత రంపపుకోతో ఆలోచించు. ఆ పార్థసారథి ఎంత బ్లడీ రోగో మనకు తెలియనిదా? పెళ్ళాం పిల్లలకే తిండి పెట్టడు. పిల్లలు చెత్తకుండీలలో అరటిపండు తొక్కలు గీరుకుంటూ తిరుగుతారు. ఆవిడ వాళ్ళింటా, వీళ్ళింటా పనీ పాటా చేసి కడుపు నింపుకుంటూంటుంది. అలాంటి ఇడియట్ ఆవులకి కడుపు నిండా గడ్డి పెడతాడా? ఊరి మీద కిలాగే తోలేస్తాడు. అందుకే నిన్ను అనవలసి వచ్చింది. నువ్వెంత బాధపడుతున్నావో నాకు... "నీరజ మాట పూర్తికాకముందే ఆవిడ అక్కణ్ణుంచి లేచి వెళ్ళిపోయారు.

ఇంటికొచ్చిన తండ్రితో జరిగిందంతా చెప్పి "మధ్యాహ్నం నుంచీ నాతో మాట్లాడ్డం మానేసింది. అయినా నిన్ననాలి నాన్నా! అమ్మ పిచ్చిని అదుపుపెట్టక ఎంకరేజ్ చేసి చెడగొడుతున్నావ్! తన కీ మధ్య బి.పి. బాగా పెరిగి పోతోంది. ఇలాంటి వాటివల్ల. నీకది తెలుసా?" అంది చిరుకోపంతో. ఆయన కెందుకో కాస్త బాధ అనిపించింది. అయినా లేని ఓపిక తెచ్చుకొని ఆమె ఎదురుగా కూర్చుంటూ "మీ

మినీ కథ

# తారుమారు

"హల్లో! హల్లో!"

"ఏమండోయ్ మీరా?"

"అబ్బ! మీరు ఈ ట్రెయినుకేనా?"

"కూలీ కావాలా సార్?"

"టీ... కాఫీ సార్!"

ఇలాటి అరుపులతో గందరగోళంగా ఉంది ప్లాట్‌ఫారం. ఇంకా రైలు రాలేదు కాబట్టి కొంచెం ఫరవాలేదు.

అది మార్చి నెలాఖరేమో, ఎండ దంచిపారేస్తూంది. ఎవరికి వారే నీడలో రక్షణ పొందాలని ప్రయత్నిస్తున్నారు.

అప్పుడే రిక్షా దిగి వచ్చారు అనంత్, సదాశివలు.

"ఇంకా అరగంట టైమ్ ఉంది" అన్నాడు అనంత్.

"దేనికి?" ఏదో పరధ్యానంలో అన్నాడు సదాశివ.

"దేని కేమిటోయ్? నీ బొంద—'ట్రెయిను' రావటానికి."

ఇద్దరూ వెళ్ళి ఓ బెంచీమీద కూర్చుని పిచ్చాపాటీలో పడ్డారు.

ఆ ఇద్దరూ పదిహేడేళ్ళ యువకులు. ఇంటర్ పరీక్షలు రాసి, ఇప్పుడు సెలవుల్లో ఎక్కడికన్నా వెళ్ళాలని నిశ్చయించుకుని 'బెంగుళూరు' బయలుదేరారు. అక్కడ అనంత్ బాబాయ్ ఉన్నారు.

"ట్రెయి నొచ్చేస్తోంది." గట్టిగా అరిచాడు సదాశివ.

"అలాగా!" హడావుడిగా లేచాడు అనంత్.

ముందుగానే రిజర్వు చేయించుకున్న ప్రకారం తమ బెర్తుల్లో సర్దుక్కూర్చున్నారు. పెద్దగా కూత పెట్టి బయలుదేరింది ట్రెయిన్.

నెమ్మదిగా కర్నూలు పట్టణం దూరమైంది. సదాశివ కిటికీలో నుంచి బయటకు చూస్తూ, ఈలపాట పాడుతున్నాడు. ఇక 'అనంత్' సరేసరి, కంపార్ట్‌మెంటంతా వినపడేలా 'టేప్ రికార్డర్' ఆన్ చేశాడు. అంత దూరం ప్రయాణం చేయటం ఇద్దరికీ అదే మొదటిసారి. అందుకే అంతగా ఆనందించగలుగుతున్నారు.

ఇంతలో ఎదుటి బెర్తుమీద పడుకుని ఉన్న ముసలాయన అప్పుడే నిద్ర లేచి అడిగాడు—"అనంతపూర్ వచ్చిందా?"

"లేదండీ, ఇంకా చాలా సేపవుతుంది." ఒక్కసారే చెప్పా రిద్దరూ.

"నన్ను తప్పక అనంతపూర్‌లో లేపండి."

"అలాగే."

సంభాషణ అంతా హిందీలోనే జరుగుతోంది. ముసలాయన నడుం వాల్చబోతూ ఇలా అన్నాడు—"నాకు నిద్ర లేపితే తిక్కకోపం వస్తుంది. లేపినవాళ్ళను బాగా తిడతాను. అనంతపూర్‌లో నా పిదంగా చేస్తే, నా సామాను ప్లాట్‌పారంమీదికి విసిరి, నన్ను కూడా నెట్టేయండి. ఓ.కే?"

సరే నన్నారు మిత్రద్వయం.

సుమారు అయిదు గంటలు ప్రయాణించి అనంతపూర్ చేరింది రైలు. అనంత్, సదాశివలకు తమ కర్తవ్యం గుర్తొచ్చి ఎదుటి బెర్తుమీద పడుకున్న ముసలాయన్ని నిద్ర లేపారు. ఆయన వీళ్ళు ఊహించినట్లే తిట్లు ప్రారంభించాడు. కానీ, ఆయన ఇచ్చిన 'అభయం' గుర్తొచ్చి, ఆయన సామాను ప్లాట్‌ఫారంమీదికి విసిరి ఆయన్ను నెట్టిపారేశారు.

ఆయన లబలబలబలాడుతూ తిరిగి ఎక్కేలోగా ట్రెయిను బయలుదేరింది.

అనంతపూర్ దాటి సుమారు అరగంట అయింది. ఏదో చిన్న స్టేషన్ వచ్చింది. ఆ కలకలానికి నిద్ర లేచాడు ఎదుటే ఉన్న పై బెర్తులోని మరో ముసలాయన.

"అబ్బాయ్! అనంతపూర్ వచ్చిందా?"

"అబ్బే! దాటి చాలా సేపైందండీ."

"మరయితే నన్ను లేపలేదేం?"

అప్పటి కర్థమైంది వాళ్ళకు కింది బెర్తు ఆయన్ను కాదు లేపాల్సింది పై బెర్తు ఆయన్ను అని. ఇక ముసలాయన తిట్లకు అంతు లేకపోయింది. అటేడు, ఇటేడు తరాల్నీ ఏకిపారేస్తున్నాడు.

"ఆయ నంతగా తిడుతుంటే ఊరికే ఉన్నా రెందుకు బాబూ?" ఇంకో పెద్దమనిషి అడిగాడు.

"అనంతపూర్‌లో తిట్టాడు లెండి ఒకాయన—వాటితో పోలి స్తే ఇవెంత?" అన్నారు సదాశివ, అనంత్‌లు ఇద్దరూ.

—రాయపెద్ది వివేకానంద్